07062024-MAI-06_Layout 1 6/7/2024 3:53 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

## అబ్ కీ బార్ సంకీర్ణ సర్కార్

**ఉత్తరాదిలో** ఇకముందు 'అబ్ కీ బార్' అనే మాటలను ఏ రాజకీయ పార్టీ కూడా తన ఎన్నికల ప్రచారంలో ఉపయోగించాలని అనుకోకపోవచ్చు. దీన్ని అంతగా అరగదీసి మూలకు పడేసింది బీజేపీ. 'అబ్ కీ బార్ చార్ సౌ పార్' అనే నినాదం వశీకరణ కోసం పఠించిన మంత్రం మాత్రమేనని ఫలితాలు చూసిన తర్వాత తేలిపోయింది. ప్రధాని నరేంద్ర మోదీ దీన్ని వీలైనన్ని సభల్లో ఉల్లేఖించారు. కానీ చివరికి తమ పార్టీకి ఉన్న మెజారిటీ కూడా నిలబెట్టుకోలేకపోయారు. ఎన్డీయే మిత్రపక్షాల మద్దతు లేకుండా బండి నడవని పరిస్థితి వచ్చిపడింది మోదీకి. 'అబ్ కీ బార్ సంకీర్ణ సర్కార్' అనుకోక తప్పదు. మరోసారి దేశంలో సంకీర్ణాల యుగం వచ్చేసింది. తెదేపా, జేడీయూ అనే రెండు చంకకర్రల వత్తాసుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మోదీ సిద్ధమవుతున్నారు. మొదటి విడతలో ఉన్న బీజేపీ మెజారిటీ రెండో విడతలో అపారంగా పెరిగింది. మూడో విడత వచ్చేసరికి ఆ పార్టీ బలం 240 వద్ద చతికిలబడింది. ఇది మోదీ ప్రతిష్ఠను చాలావరకు తగ్గించింది. ఇప్పుడు సంకీర్ణం నడపడం విషయంలో ఆయనకున్న ప్రతిభా పాటవాలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మోదీ ఎంతవరకు సర్దుబాటుకు సిద్ధమవుతారన్నదే అసలు ప్రశ్న.

2014లో గుజరాత్ నుంచి నేరుగా ఢిల్లీ పీఠంపైకి వచ్చిపడిన మోదీకి అఖండమైన అధికారం దఖలుపడింది. దేశంలో గత పదేండ్లుగా మోదీ ఏకచ్ఛత్రాధిపత్య పాలన కొనసాగింది. భారతదేశ పరిపాలన కేవలం ఒక వ్యక్తి చుట్టూ తిరిగింది. మోదీ వ్యక్తి పూజ ఆకాశపుటంచులు తాకింది. పేరుకు ఎన్డీయే కూటమి అయినా బీజేపీకి సొంత మెజారిటీ ఉండటం కలిసివచ్చింది. కానీ ఇప్పుడదంతా కుదరదు. మిత్రపక్షాల కనుసన్నల్లో, వారు ముందుకుతెచ్చే డిమాండ్ల చెప్పుచేతల్లో పాలన నడవాలి. ఎప్పుడు ఎవరికి కోపం వస్తుందో, మద్దతు లాగేసుకొని మరో సంకీర్ణం వైపు పరుగులు తీస్తారో అని బెదురుబెదురుగా గడపాల్సి ఉంటుంది. సొంత ఎజెండా లేదా రహస్య ఎజెండా అనేది ఎంతమాత్రమూ కుదరదు. అన్ని పక్షాలు ఆమోదించిన కనీస ఉమ్మడి కార్యక్రమం ప్రకారమే పాలన సాగించాల్సి ఉంటుంది. మద్దతు తెలిపిన నేతల గొంతెమ్మ కోరికలు తీర్చడమనేది కత్తి మీద సాము లాంటిది. అందరికీ తలలో నాలుకలా వ్యవహరించక తప్పదు. ఇది మోదీకి ఏ మాత్రం అలవాటు లేని విషయం. మూడో విడత మూన్నాళ్ల ముచ్చట అవుతుందా లేక కొసకంటా కొనసాగుతుందా అనేది కాలమే నిర్ణయించాలి.

సంకీర్ణాలు మన దేశానికి కొత్త కాదు. రాజీవ్ గాంధీ హయాం తర్వాత చాలా సంకీర్ణాలే వచ్చాయి. చిన్నాచితకా పార్టీల నేతలు కూడా పెత్తనం చెలాయించడం సంకీర్ణాల ప్రత్యేకత. పిడికెడు మంది ఎంపీలున్నవారు కూడా మంత్రి పదవులు పొందడానికి వీలవుతుంది. ఐకే గుజ్రాల్, దేవేగౌడ వంటి నేతలు అనూహ్యమైన రీతిలో ప్రధాని పదవికి ఎగబాకడం సంకీర్ణాల మహత్యమే. సమష్టి తత్వం అనేది సంకీర్ణాల్లో తప్పనిసరి. ఢిల్లీలో గద్దెనెక్కేవారు ఇష్టారాజ్యంగా పోకుండా అదుపాజ్ఞలలో ఉండటం, ప్రాంతీయ ఆకాంక్షలకు ప్రాధాన్యం పెరగడం వంటి ప్రత్యేకతలు కొన్ని దీనికి ఉంటాయి. కేంద్రీకృత పాలన కన్నా సంకీర్ణ పాలనలో సమాఖ్యవాదం మెరుగ్గా ఉంటుంది అనేది అనుభవమే. ఢిల్లీ పాదుషా ఇప్పుడు సామంత రాజుల ఆధిపత్యంలోకి వచ్చారు. చంద్రబాబునాయుడు, నితీశ్‌కుమార్ యాదవ్ వంటి ప్రాంతీయ నేతలే చక్రం తిప్పుతున్నారు. బేరాలు కుదుర్చుకొని లిఖితపూర్వకంగా మద్దతు తెలిపారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఈ ఇద్దరు నేతలను తమ వైపు తిప్పుకునేందుకు ప్రయత్నించినట్టు వార్తలు వెలువడ్డప్పటికీ ప్రస్తుతం అలాంటిది సాధ్యమయ్యే అవకాశాలు కనిపించడం లేదు. ఇద్దరు నేతలూ బేరసారాల్లో దిట్టలు. పైగా సమయానుకూలంగా విధేయతలు మార్చడంలో సిద్ధహస్తులు. ఈ కారణంగా కొన్ని అపనమ్మకాలు ఉన్నప్పటికీ మొత్తం మీద ప్రస్తుతానికి ఒడంబడికైతే కుదిరింది. ముమ్ముందు ఏం జరుగుతుందో కాలమే చెప్పాలి.

# సమాఖ్యవాదం పునరుద్ధరణ

గాయిగత్తర లాంటి ఎగ్జిట్ పోల్స్‌ను పొరపాటున విశ్వసించినవారికి 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు షాకిచ్చాయి. ఇవి గత మోదీ సర్కార్ తెరపైకి తీసుకొచ్చిన కథనాలను కొనసాగించాయి. ఈ తప్పుడు అంచనాలను ఎంతగానో సమర్థించిన చాలామంది పండితులు (విశ్లేషకులు) ఇప్పుడు వాస్తవ ఫలితాలను కూడా విశ్లేషించేందుకు సిద్ధమైపోయారు. వారు చెప్తున్న ప్రధాన విశ్లేషణ ఏమిటంటే.. సామాజిక న్యాయం, కులగణన గురించి ఇండియా కూటమి ఎక్కువగా ప్రచారం చేయడం, తెలివైన మిత్రులు, ప్రాంతీయ పార్టీలతో జట్టుకట్టడం, కుల సమీకరణాలను అనుసరించి బలమైన నేతలను బరిలోకి దించడమే అందుకు కారణమని పేర్కొంటున్నారు.



జయతీ ఘోష్



సామాజిక న్యాయం ఆవశ్యకతను గుర్తించడంతో పాటు రాజ్యాంగ మనుగడ గురించిన భయాందోళనలు ఈ ఎన్నికల్లో కీలకపాత్ర పోషించాయనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. దాంతో పాటు వివిధ రాష్ర్టాల్లోని స్థానిక అంశాలు కూడా ముఖ్య భూమికను పోషించాయి. అయితే తర్వాతి ప్రభుత్వాన్ని ఎవరు ఏర్పాటు చేసినా ఓటర్లు ఇచ్చిన స్పష్టమైన సందేశాన్ని గుర్తించాలి. ఆ సందేశం ఏమిటంటే.. ఆర్థిక సమస్యల ప్రాముఖ్యం. నిరుద్యోగం, చాలీచాలని వేతనాలు, స్వయం ఉపాధి ద్వారా లభించే ఆదాయం సరిపోకపోవడం, నిత్యావసరాల ధరల పెరుగుదల వంటి ప్రధాన సమస్యలను మోదీ ప్రభుత్వం తన విధానపరమైన నిర్ణయాల్లో, ఎన్నికల ప్రచారాల్లోనూ సమర్థవంతంగా విస్మరించింది. అయినప్పటికీ సామాన్యులకు జీవనాధారమైన కూడు, గూడు తదితర సమస్యలు దేశంలోని మెజారిటీ ప్రజల జీవితాలను పీడిస్తూనే ఉన్నాయి.

ఈ తరుణంలో ప్రతిపక్ష ఇండియా కూటమి, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ.. యూపీ వంటి హిందీ రాష్ర్టాల్లో చేసిన వాగ్దానాలు ఎంతో కీలకంగా మారాయి. మోదీ ప్రభుత్వంతో పాటు, ప్రధాన స్రవంతి మీడియా సంస్థలు ఏకరువు పెట్టిన బీజేపీ విధానాల తరహాలో కాకుండా విపక్ష పార్టీలు సామాజిక న్యాయంతో పాటు జీవనోపాధి, ఉపాధి సమస్యలపై దృష్టి సారించాయి. వారి వాగ్దానాలు చాలామంది ఓటర్లలో నిస్సందేహంగా ప్రతిధ్వనించాయి.

**మౌలిక పరివర్తన..:** యువత, మహిళలు, రైతులు, కార్మికులకు న్యాయం చేయడంపై దృష్టి సారిస్తామని, దాంతో పాటు సామాజిక న్యాయం ద్వారా ఆయా వర్గాల గౌరవాన్ని పెంపొందిస్తామని కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో ప్రధానంగా ప్రస్తావించింది. ప్రజలకు సరుకులు, సేవలను అందించడాన్ని రాష్ట్రం లేదా అత్యున్నత నాయకుడు ఇచ్చే 'బహుమతి'గా చూడకుండా మానవ హక్కుల, ప్రత్యేకించి సామాజిక ఆర్థిక హక్కువైపుగా మళ్లడమనేది చాలా ముఖ్యమైన మార్పు. ఇది కచ్చితంగా ఆర్థిక విధానంలో మౌలిక పరివర్తనను సూచించే అంశం.

> **ఆర్థిక విధాన చట్రంలో రెండు మార్పులు చేయడం తక్షణ అవసరం. వాటిలో మొదటిది.. పనిహక్కును విస్తరించడం ద్వారా ప్రతిఒక్కరికీ సామాజిక, ఆర్థిక హక్కులపై భరోసా కల్పించడం (ఉపాధిహామీ పథకానికి అధికంగా నిధులు కేటాయించడం, పట్టణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టడం). సుమారు 10 కోట్ల మందికి అరకొరగా అందుబాటులోకి వచ్చిన లేదా అందకుండా ఉండిపోయిన ఆహార హక్కును, ప్రభుత్వ విద్య ద్వారా విద్యా హక్కును కల్పించడం, సామాజిక హక్కుకు భరోసా ఇవ్వడం, ముఖ్యంగా వృద్ధులు, ఇతర కారణాల వల్ల పని చేయలేనివారికి కనీస వేతనంలో సగాన్ని సార్వత్రిక పెన్షన్ల రూపంలో అందించడం. దాంతో పాటు ఆరోగ్య హక్కుకు హామీ ఇవ్వడం.**

రెండోది.. నిస్పృహకు గురవుతున్న కోట్ల మంది యువకుల ఆకాంక్షలను తీర్చడానికి ఉద్యోగాలను సృష్టించడం. ఇది ప్రాథమిక ఆర్థిక లక్ష్యం కావాలి. అందుకు ప్రభుత్వ ఉద్యోగాల విస్తరణ అవసరం. ముందుగా ఖాళీలను భర్తీ చేయాలి. తాత్కాలిక ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి. గత దశాబ్దంలో తీసుకున్న విధానపరమైన నిర్ణయాల వల్ల దెబ్బతిన్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ఆదుకోవాలి. అప్పులు, నూతన సాంకేతికత, మౌలిక వసతులు, శిక్షణ, మార్కెటింగ్ సహాయంతో కూడిన సమగ్ర ప్యాకేజీని వాటికి అందించాలి. వ్యవసాయ రంగంలో కూడా సంక్షోభం కొనసాగుతున్నది. రైతుల న్యాయబద్ధమైన డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో వాటిపై సమగ్రంగా చర్చించాలి. వీటితో పాటు వాతావరణ మార్పుల ప్రభావం, అధిక ఉష్ణోగ్రతలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

మోదీ సర్కార్ తీసుకొచ్చిన నూతన సంక్షేమవాదం గురించి చాలా చర్చ జరిగింది. కానీ, అందులో స్థాయిలో గానీ, సారంలో గానీ పెద్దగా మార్పులేమీ లేవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను ఎప్పటినుంచో అందిస్తున్నాయి. దేశంలో కొనసాగుతున్న పేదరికం, అట్టడుగున ఉండే మానవాభివృద్ధి సూచికల కారణంగా ఇవి అవసరమే. మోదీ ప్రభుత్వం తన పథకాలు, విధానాలను పూర్తిగా కొత్తవిగా ప్రచారం చేసింది. కానీ, వాస్తవానికి అవన్నీ పాత పథకాలకు కొనసాగింపు లేదా విస్తరణ మాత్రమే. వాటినే ప్రధానమంత్రి బహుమతులుగా ప్రచారం చేస్తున్నారు. అందుకు బదులుగా ఆ పథకాలను పౌరుల హక్కులను నెరవేర్చేవిగా ప్రచారం చేయాలి. ఉదాహరణకు ఉచిత ఆహార పథకం (రేషన్) సుమారు 80 కోట్ల మందికి ముఖ్యమైన బహుమతి అని టాంటాం వేశారు. కానీ, ఈ పథకం గత యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిందే. జాతీయ ఆహార భద్రతా చట్టం కింద ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తున్న ఆహార పదార్థాలను గతంలోనే సబ్సిడీ కింద గోధుమలు కిలో రూ.2, బియ్యం కిలో రూ.3 లెక్కన అందించారు. కాబట్టి, ఇది అంత పెద్ద తేడా కాదు.

గత దశాబ్ద కాలంగా కనిపిస్తున్న అప్రజాస్వామిక కేంద్రీకరణకు భిన్నంగా అసలైన సమాఖ్యవాదం పునరుద్ధరణే ఈ ఎన్నికల ఫలితంగా సంభవించే ప్రధానమైన మార్పు. సాధారణ ప్రజలను ప్రభావితం చేసే అనేక ప్రజా సేవలను అందించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. కేంద్ర ప్రభుత్వ జోక్యం, నియంత్రణ, పక్షపాతం లేకుండా ఆ సేవలను అందించడమే కీలకం ఇప్పుడు.

(ది హిందూ సౌజన్యంతో)

> **మోదీ ప్రభుత్వం తన పథకాలు, విధానాలను పూర్తిగా కొత్తవిగా ప్రచారం చేసింది. కానీ, వాస్తవానికి అవన్నీ పాత పథకాలకు కొనసాగింపు లేదా విస్తరణ మాత్రమే. వాటినే ప్రధానమంత్రి బహుమతులుగా ప్రచారం చేస్తున్నారు. అందుకు బదులుగా ఆ పథకాలను పౌరుల హక్కులను నెరవేర్చేవిగా ప్రచారం చేయాలి. ఉదాహరణకు ఉచిత ఆహార పథకం (రేషన్) సుమారు 80 కోట్ల మందికి ముఖ్యమైన బహుమతి అని టాంటాం వేశారు.**



## అస్తిత్వం కోసం పోరాటం తప్పదేమో!

> **చిహ్నాలను మారిస్తేనో, పేర్లను చెరిపేస్తేనో చెరిగిపోయేవి కావు కేసీఆర్ గుర్తులు. తెలంగాణలోని సబ్బండ వర్గాల గుండెల్లో ఆయన పేరు, గుర్తులు ఎప్పుడో ముద్రితమైపోయాయి. తెలంగాణ ప్రజల జీవితాలే అందుకు సజీవ సాక్ష్యాలు. వాటిని చెరిపివేయడం ఎవరి తరం కాదు.**



డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్
88866 66006

కేసీఆర్ అంటేనే ఒక విజ్ఞాన గ్రంథం. తెలంగాణ విశిష్టత, అస్తిత్వం, చరిత్ర గు రించి ఆయనకు తెలిసినంతగా మరెవరికీ తెలియదు. అందుకే స్వరాష్ట్రం ఏర్పడ్డాక సుదీర్ఘ చర్చలు, మేధోమథనం చేసి తెలంగాణ అస్తిత్వం, చరిత్ర కు పెద్దపీట వేసి రాష్ట్ర చిహ్నాన్ని రూపొందించారు.

రాష్ట్రం చిహ్నంలో కాకతీయ కళాతోరణానికి చోటు కల్పించడం వెనకున్న మేధోమథనాన్ని తెలంగాణ ప్రజానీకం తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నది. వరంగల్ కోటలోని నాలుగు కాకతీయ తోరణాలు అలంకార తోరణాలు కావు, నాటి కాకతీయ పాలకుల వైభవానికి ప్రత్యక్ష సాక్ష్యాలు. నాటి పాలనా వైభవం, కాకతీయుల విజయాలు, ప్రజల జీవన స్థితిగతులను కండ్లకు కట్టినట్టు పూసగుచ్చినట్టుగా చెప్తాయి కళా తోరణాలు. తోరణంలోని నాలుగు పిల్లర్లు కాకతీయుల పాలనలో ధర్మం నాలుగు పాదాల మీద నడిచిందనడానికి నిదర్శనం. చివరి రెండు పిల్లర్లపై ఉండే గర్జించే సింహాలు కాకతీయుల నాయకత్వానికి చిహ్నాలు. వాటిపక్కన తలపైకెత్తి నిల్చున్న మొసలి నాటి జలకళకు ప్రతీతి. ఎందుకంటే కాకతీయుల కాలంలో చెరువులు, కుంటలు, కాలువలలో పుష్కలంగా నీళ్లు ఉండేవి. నీళ్లు ఉన్నచోటే మొసళ్లు ఉంటాయి. తోరణంలో కనిపించే లతలు, తీగలు వారి గొలుసుకట్టు చెరువులను, కుంటలను సూచిస్తాయి. తోరణంపైన ఉండే రెండు హంసలు పారదర్శక పాలనకు నిదర్శనం. హంసల కింద ఉండే కుబేర విగ్రహాలు వారి ఆర్థిక పుష్టికి చిహ్నం. కింద భాగాన బోర్లించిన ఏడు పూర్ణకుంభాలు గ్రామ దేవతలకు ప్రతిబింబాలు. వాటినే సప్త మాతృకలు అని కూడా పిలుస్తారు. స్తంభం మధ్యలో ఉండే చేపల చిత్రాలు మత్స్య సంపదకు సంకేతం.

నాటి కాకతీయుల పాలన వలె తెలంగాణ కూడా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించిన తొలి సీఎం కల్వకుంట్ల చంద్రశేఖరరావు కళా తోరణాన్ని రాష్ట్ర చిహ్నంలో పొందుపరిచారు. అంతేకాకుండా తాను ఎంచుకున్న కళా తోరణంలోని అంశాలను ప్రతిబింబించేలా తెలంగాణను సుభిక్షంగా మార్చారు. కాకతీయుల వలె కేసీఆర్ కూడా సంక్షేమ పాలన అందించారు. కరవును పారదోలారు. వలసలకు అడ్డుకట్ట వేశారు. బీడుబారిన నేల దూప తీర్చారు. దండుగ అన్న ఎవుసాన్ని పండుగలా చేశారు. కేసీఆర్ అంటే కే- కాలువలు, సీ- చెరువులు, ఆర్- రిజర్వాయర్లు అనేంతలా పాలించారు.

నేటిప్రభుత్వ పెద్దలకు తెలంగాణ అస్తిత్వం గురించి, చరిత్ర గురించి కనీస అవగాహన లేకపోవడం మన దౌర్భాగ్యం. అందుకే నేడు రాష్ట్రంలో తుగ్లక్ పాలనను చూడాల్సిన దుస్థితి నెలకొంది. ఎంతో ఘనమైన చరిత్ర ఉన్న కళా తోరణాన్ని రాష్ట్ర చిహ్నం నుంచి తొలగించాలనుకోవడం దురదృష్టకరం. చిహ్నంలోని కళాతోరణం స్థానంలో అమరుల స్థూపాన్ని మారుస్తున్నట్టు ప్రచారం చేస్తూ ఉద్యమకారులను కాంగ్రెస్ పాలకులు మభ్యపెడుతున్నారు. అమరుల త్యాగాలు కీర్తించదగినవే. అయితే అమరుల పేరుగాని, వారి త్యాగాలను గాని పలికే అర్హత కాంగ్రెస్‌కు లేదు. ఎందుకంటే తెలంగాణ ఉద్యమంలో అంత మంది అమరులవ్వడానికి కారణమైనదే కాంగ్రెస్. చిహ్నంలో అమరుల స్థూపాన్ని పెడతామనడం ఎట్లుందంటే.. చంపినోడే పూలదండ వేసి నివాళులర్పించినట్టుంది.

1952లో హైదరాబాద్ స్టేట్ ప్రత్యేక రాష్ట్రంగా ఉండాలని పోరాటం చేసిన సిటీ కాలేజీ విద్యార్థులపై కాల్పులు జరిపి ఆరుగురిని పొట్టనబెట్టుకున్నది కాంగ్రెస్ కాదా? 1969 నాటి తొలి దశ ఉద్యమంలో 370 మందిని కాల్చి చంపింది హస్తం పార్టీ కాదా? 1971 పార్లమెంట్ ఎన్నికల్లో 11 చోట్ల గెలుపొందిన తెలంగాణ ప్రజా సమితి పార్టీని భూస్థాపితం చేసింది కాంగ్రెస్ కాదా? 2004లో ఇచ్చిన మాట తప్పడంతోనే కదా వందలాదిమంది యువకులు బలిదానం చేసుకున్నది. తెలంగాణ బిడ్డలను అమరులను చేసిన కాంగ్రెస్ పార్టీయే రాష్ట్ర చిహ్నంలో అమరుల స్థూపాన్ని పెడతామని చెప్తుంటే నోరెళ్లబెట్టి చూస్తున్నది నా తెలంగాణ. అమరులకు పెద్దపీట వేస్తున్నామని చెప్పే కాంగ్రెస్.. స్వాతంత్ర్య సమరంలో అమరులైన యోధుల చిహ్నాన్ని భారత రాజముద్రగా స్వీకరించకుండా అశోకుడి స్థూపంలోని నాలుగు సింహాలు, అశోక చక్రాన్ని ఎందుకు స్వీకరించిందో సమాధానం చెప్పాలి.

తెలంగాణ బిడ్డలు ఉద్యమ ఉగ్గుపాలు తాగి పెరిగారు. సమ్మక్క, సారక్క, రాణి రుద్రమదేవి, సర్వాయి పాపన్న, దాశరథి, వీరవనిత చాకలి ఐలమ్మల వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్నారు. ఈ ప్రాంత బిడ్డలకు పోరాటం కొత్త కాదు, త్యాగాలు కొత్త కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం తన తీరును మార్చుకోకపోతే అస్తిత్వం కోసం మరో ఉద్యమం తప్పక పురుడుపోసుకుంటుంది.

జై తెలంగాణ.. జైజై తెలంగాణ..

(వ్యాసకర్త: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు)

# మార్పు మొదలైంది!



జీడిపల్లి రాంరెడ్డి
96666 80051

> **'కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిపోయింది' అన్నట్టుంది తెలంగాణ ప్రజల పరిస్థితి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అబద్ధపు ప్రచారాలను నమ్మి ప్రజలు నట్టేట మునిగారు. మార్పు.. మార్పు.. అని ఊదరగొట్టిన కాంగ్రెస్ గద్దెనెక్కిన తర్వాత నిజంగానే మార్పు తీసుకొచ్చింది. కానీ, అది ప్రజలు కోరుకున్న మార్పు మాత్రం కానేకాదు.**

తెలంగాణ ప్రజలను తొమ్మిదిన్నరేండ్ల పాటు కంటికిరెప్పలా కాపాడుకున్న కేసీఆర్ మార్కు పాలనకు తిలోదకాలిచ్చిన కాంగ్రెస్.. పాత కాలపు హస్తం మార్కు పాలనను మళ్లీ ప్రజలకు రుచి చూపిస్తున్నది. కేసీఆర్ మీద అక్కసు ఉంటే ఉండొచ్చు గానీ, ఆయన చేపట్టిన కార్యక్రమాలపై అక్కసు చూపించడం కాంగ్రెస్ పాలకుల వెర్రితనమే. తెలంగాణ ఉద్యమ సమయంలో ఏర్పాటు చేసుకున్న తెలంగాణ తల్లి విగ్రహంతో పాటు రాష్ట్ర చిహ్నం, జయ జయహే తెలంగాణ గీతంలో మార్పులు చేయడాన్ని చూసి.. 'గీళ్లు గీ మార్పు కోసమే అధికారంలోకి వచ్చారా?' అని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. పాలకులెవరైనా తమ గుర్తులను భవిష్యత్తు తరాలకు అందిస్తారు. వారి గుర్తుగా శిలాశాసనాలు, గుమ్మటాలు, కోటలు, చిహ్నాలను ఏర్పాటు చేసుకుంటారు. తర్వాతి తరాలవారు వాటినే జ్ఞాపకాలుగా చేసుకొని, ఆదర్శంగా తీసుకొని పాలన సాగిస్తారు. ఆ కోవలోనివే కళాతోరణం, చార్మినార్. నాటి తెలంగాణ కళా వైభవానికి గుర్తుగానే కేసీఆర్ సర్కార్ వాటికి అధికారిక చిహ్నంలో చోటు కల్పించింది. కేసీఆర్ కూడా తన గుర్తులుగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారు. కానీ, రేవంత్‌రెడ్డి మాత్రం అందుకు భిన్నంగా ఉన్నవాటిని తొలగిస్తూ అపహాస్యం పాలవుతున్నారు.

పాలకులు వస్తుంటారు, పోతుంటారు. కొంత మందే ప్రజల గుండెల్లో స్థానాన్ని సంపాదించుకుంటారు. అలాంటి అరుదైన నాయకుడే కేసీఆర్. తెలంగాణ రాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేయడమే కాకుండా, సంక్షేమ తెలంగాణను మన కండ్లముందే సాక్షాత్కరింపజేశారాయన. కేసీఆర్ హయాంలో జరిగిన తెలంగాణ అభివృద్ధిని యావత్ దేశం కీర్తిస్తుంటే.. కాంగ్రెస్ పాలకులు మాత్రం గోరంతను కొండంతగా చిత్రీకరిస్తూ విమర్శలు చేస్తూనే ఉన్నారు. ఎవరెన్ని విమర్శలు చేసినప్పటికీ తెలంగాణలో 70 ఏండ్లలో జరగని అభివృద్ధి తొమ్మిదిన్నరేండ్లలో జరిగిందన్నది మాత్రం వాస్తవం.



మరోవైపు కాంగ్రెస్ ఆరు నెలల పాలనలోనే రాష్ట్రం ఆగమాగమైంది. ఉమ్మడి పాలనలో ఎదుర్కొన్న కష్టాలు మళ్లీ తెలంగాణను చుట్టుముడుతున్నాయి. మరీ ముఖ్యంగా రైతుల బాధలు వర్ణనాతీతం. మొన్నటివరకు వడ్లు అమ్ముకునేందుకు నానా తిప్పలు పడ్డ రైతన్నలు ఇప్పుడు విత్తనాల కోసం రోడ్కెక్కాల్సిన దుస్థితి వచ్చింది. గత తొమ్మిదిన్నరేండ్లలో ఎన్నడూ కానరాని చెప్పుల లైన్లు మళ్లీ దర్శనమిస్తుండటం దురదృష్టకరం. ఆదిలాబాద్‌లో పత్తి విత్తనాల కోసం బారులుతీరిన రైతులపై పోలీసులు లాఠీచార్జి చేయడం అమానుషం. కాంగ్రెస్ పాలకుల మాటలు కోటలు దాటుతున్నాయి కానీ చేతలు గడప దాటడం లేదు. ఏదైనా అంటే ఖజానా ఖాళీ అని అంటారు. మరి కేసీఆర్ దగ్గర ఏమైనా మంత్రదండం ఉందా?


కాంగ్రెస్ పాలనలో రైతుబంధు అటకెక్కింది. రైతు భరోసా ఇవ్వనే లేదు. యాసంగి సీజన్ రైతుబంధు పైసలను నిన్నమొన్నటి వరకు ముక్కుతూ ములుగుతూ ఇచ్చారు. ఇక వానాకాలం రైతుబంధు ఎప్పుడు ఇస్తారో తెల్వదు. రూ.2 లక్షల రుణమాఫీ సంగతి సరేసరి.

వరికి బోనస్‌పై మాట మార్చేశారు. సన్న వడ్లను ఎక్కువగా వానాకాలంలోనే సాగు చేస్తారు. దానికి చీడపీడల బెడద ఎక్కువ. అందుకే తిండి గింజల కోసమే ఆ రకాన్ని రైతులు సాగు చేస్తారు. పైగా సన్న వడ్లకు మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువ. దాంతో రేటు ఎక్కువే పలుకుతుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే రూ.500 బోనస్‌తో రైతులకు ఒరిగేదేమీ లేదనేది సుస్పష్టం.

ఆడబిడ్డ పెండ్లికి కేసీఆర్ ఇచ్చే రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని నమ్మబలికిన కాంగ్రెస్ నాయకులు చేతులు ఎత్తేశారు. తులం బంగారం సంగతేమో కాని లక్ష అయినా ఇవ్వాలని ఆడబిడ్డల తల్లిదండ్రులు వేడుకునే పరిస్థితి వచ్చింది. మహిళలకు ఇస్తామన్న రూ.2500 ఊసే లేదు. విద్య, వైద్యం పడకేశాయి. వంద రోజుల్లోనే రెండో విడత గొర్రెల పంపిణీ చేస్తామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించి.. నేడు డీడీలను వాపస్ ఇస్తున్నారు.

> **సమైక్యాంధ్ర పాలనలో కరవును తాళలేక వలసబాట పట్టిన రైతన్నలు కేసీఆర్ హయాంలో వాపస్ వచ్చారు. వ్యవసాయం చేసుకుంటూ హాయిగా ఉన్నారు. కానీ, నేడు మళ్లీ కరెంటు కష్టాలు మొదలయ్యాయి. వలసలు షురూ అయ్యాయి. ఆరు మాసాల్లోనే ఏం కోల్పోయారో ప్రజలు తెలుసుకుంటున్నారు. రైతులతో సహా అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పాలనపై అసంతృప్తితో ఉన్నారు. గడీల పాలన, దొరల పాలన, మద్యం ఏరులై పారుతుంది.. అంటూ ఊదరగొట్టిన యూట్యూబ్ చానళ్ల దుష్ప్రచారాన్ని ప్రజలు నేడు అసహ్యించుకుంటున్నారు.**

'ఏం చేశారో, ఎలా చేశారో తెలియదు కానీ, కేసీఆర్ ఉన్నన్ని రోజులు కరెంటు, తాగు, సాగునీటికి కరవు లేదు. పింఛన్ ఆగలేదు. పంట వేయకముందే రైతుబంధు ఇచ్చారు. గరీబోళ్లను కడుపుల పెట్టుకొని చూసుకున్నారు. తొమ్మిదిన్నరేండ్లు కష్టమన్నదే తెల్వకుండా ఎంతో సంతోషంగా ఉన్నాం. గీ రేవంత్‌రెడ్డి అడ్డగోలుగా మాట్లాడితే నమ్మి ఓట్లేసినం. ఆగమైపోయాం' అని ఇప్పుడు తెలంగాణ ప్రజలు వాపోతున్నారు. కేసీఆర్‌ను తల్సుకుంటున్నారు.




## ఆత్మగౌరవం ఉన్నవారు తప్పుకొంటారు!

*మోదీ నాయకత్వంలోని బీజేపీ సొంతంగా మ్యాజిక్ ఫిగర్‌ను దాటలేకపోయింది. అందుకు నైతిక బాధ్యత వహిస్తూ మోదీ పక్కకు తప్పుకోవాలి. ప్రధాని పదవిని చేపట్టకూడదు. ఆత్మగౌరవం ఉన్న ఏ నాయకుడైనా సరే రాజీనామా చేసి పక్కకు తప్పుకొంటారు. తప్పించే వరకు వేచి చూడరు. బీజేపీ ప్రతిపక్షంలో కూర్చొని ఇండియా కూటమి ప్రభుత్వాన్ని దుమ్ము దులిపేయాలి.*



**- సుబ్రమణియన్ స్వామి,** *బీజేపీ సీనియర్ నేత*